# జూదం

రాధా శివ మోహన్



**ఆడవాళ్ళ** మనోభావాల్ని ఎంతో కొంత అర్థం చేసుకోవడంలో అనుభవం ఉన్న రాజు వసుంధరని నెల రోజుల పరిచయంలోనే పూర్తిగా ఆకళింపు చేసుకున్నాడు.

వసుంధర యూనివర్సిటీలో ఎమ్.ఫిల్. చదువుతోంది. రాజు రూమ్‌మేటు ఆనంద్‌కు ఎమ్. ఏ. లో క్లాసుమేటు. చక్కటి అందచందాలు, సంస్కారం... అన్నీ ఉన్న అమ్మాయి.

మొదటిసారి తనకు పరిచయం చేస్తూ చెప్పేశాడు ఆనంద్- "ఈమె వసూ...నాకు కాబోయే భార్య" అని.

మామూలుగా రేసుల్లో డబ్బు పోగొట్టుకు వచ్చిన రాజుకు మనసంతా చికాగ్గా ఉంది. 'ఎందుకో తనకు వసుంధరే గుర్తు కొస్తూంది అస్తమానూ. ఆనంద్ బాంకు ఆఫీసర్ కావడంతో రూముకు ఎప్పుడూ లేటుగానే వస్తాడు. వసుంధర లాంటి అమ్మాయి దొరికితే తన ఒంటరి జీవితానికి ఫుల్‌సాప్ పెట్టేయా'లనుకున్నాడు. కాలిపోయిన సిగరెట్‌ను ఏష్‌ట్రేలోకి నెట్టుతూ. 'వసుంధర లాంటి అమ్మాయి ఏమిటి? వసుంధరే ఎందుకు కాకూడదు?' గుండె దడ దడ లాడింది.

టీ నీళ్ళు తాగాలనిపించి స్టౌ మీద పాలు పడేశాడు.

"ఆనంద్..." తీయగా పిలుపు వినపడింది.

'వసుంధర వచ్చిం దన్న మాట.'

"కమిన్, వసూ. వాడింకా బాంక్ నించి రాలేదు." సమాధానం చెప్పాడు రాజు లోపలినుంచే.

"హల్లో, రాజూ. ఈ రోజుకూడా గుర్రాలు తన్నాయా? టీ కాస్తున్నారు. పావం?" అడిగింది వసుంధర రూములోకి అడుగు పెడ్తూ.

'ఏం? ఆనంద్‌గాడు వెళ్ళడూ రేసులకి? వాడికి పోవా పైనలు!' అర్థం లేని ఉక్రోషం గుండెలో వెర్రి తలలు వేసింది.

"లేదు, వసూ...ఈ రోజు రేసులకు సెలవు పెట్టాంగా..." అబద్ధం చెప్పేశాడు పైకి నవ్వుతూ.

"మీరు తప్పుకోండి. నేను టీ కలుపుతాను." చీరకొంగు నడ్డికి సవరించుకుంది వసుంధర.

రాజు మెల్లగా నడచి చిందులు తొక్కుతున్న వసుంధర అందాన్ని తదేకంగా చూస్తూ కుర్చీలో చతికిల పడ్డాడు. 'వసుంధర ఎప్పుడూ గలగలా ప్రవహించే నదిలా ఉంటుంది. ఎంత హుందా? ఎన్ని హొయలు? ఆమె ఎక్కడ ఉంటే అక్కడ ఏదో చైతన్యం రగులుతుందా' అనిపించింది రాజుకు. 'ఆనంద్‌గాడు చదువుకునే రోజులనించీ పుస్తకాల పక్షి. ఆడవాళ్ళ. వంక కన్నెత్తి చూసేవాడు కాదు. ఏ విధంగానూ ప్రాపంచిక విషయాల్లో చొరవ లేని వాజమ్మ' అని రాజు నమ్మకం. 'అటువంటి ఆనంద్ కా వసుంధర భార్య కాబోవడం! అన్యాయం' అనుకున్నాడు.

"పంచదార సరిపోయిందేమో చూడండి-" టీ కప్పు టేబుల్‌మీద పెడ్తూ అంది వసుంధర.

"నువ్వు టీ కలిపితే పంచదార అవసరం లేదులే" అన్నాడు టీ కప్పు తీసుకుంటూ.

అప్పుడే వస్తున్న ఆనంద్ "ఒరేయ్, రాజూ! వసూని అంతగా పొగడకురా, నాయనా! చెట్టెక్కి కూర్చుంటుంది" అంటూ వసుంధర వైపు తిరిగి "ఆ చేత్తోనే దేవి వారు నాకూ ఓ కప్పు టీ ప్రసాదిస్తే..." అన్నాడు.

"ఒన్ మినిట్..." స్టౌ వైపు తిరిగింది వసుంధర.

"రేపు కార్డు ఎట్లా ఉందిరా, రాజూ? ఆదివారం కదా... నన్నుకూడా తీసుకు వెళ్ళరా రేసులకి." ప్రాధేయ పడుతున్నట్టు అడిగాడు ఆనంద్.

"గట్టిగా అరవకురా, బాబూ. ఇప్పటికే నిన్ను పాడు చేస్తున్నా ననుకుంటోంది వసూ."

రాజు మాటలు వింటూ టీ తీసుకువస్తున్న వసుంధర "అదేం లేదు, రాజూ! ఎందుకో నాకు ఆ రేసులంటే పడి చావదు. ఆ అలవాటు తనని తన్ను శిక్షించు కోవడం లాంటిదని నా నమ్మకం. మీ రేం అనుకోరూ కదూ నే నీ విధంగా చెప్తున్నానని" అంది టీ కప్పు ఆనంద్‌కు అందిస్తూ, మరో వైపు రాజు కేసి చూస్తూ.

రాజుతో మాట్లాడేటప్పుడల్లా ఏకవచనం, బహువచనం మార్చి మార్చి ప్రయోగిస్తూ ఉంటుంది వసుంధర. ఏకవచనంలో మాట్లాడినప్పుడల్లా మనసు పొంగిపోతుంది రాజుకు. ఏదో తెలియని అనుభూతి. అంతలోనే "మీరు" అనగానే ఏదో అగాధంలో పడిపోయినట్టు ఫీలవుతాడు.

టీ తాగటం పూర్తి చేసిన ఆనంద్ "రైట్...రజూ... బేబీ... కార్డు జాగ్రత్తగా చూడు. రేపు మనది అయిదు వందలు పెట్టుబడి-కనీసం అయిదు వేలు రావాలి రేసుల్లో." గబగబా అనేసి "చలో...వసూ... ఫస్ట్ షో టైము అయిపోతోంది" అంటూ వసుంధర చేయి పట్టుకొని బయట పార్కు చేసిన స్కూటర్ వైపు నడిచాడు.

ఆనంద్ మాటలకి కళ్ళతోటే అనమ్మతి వ్యక్తం చేస్తూ ఆనంద్‌తో కలిసి వెళ్తున్న వసుంధర వైపే చూస్తూ ఉండిపోయాడు రాజు.

** ** **

మర్నాడు అప్పటిదాకా కబుర్లు చెప్తూ కూర్చున్న వసుంధర తల దువ్వుకుంటున్న ఆనంద్‌ను చూసి "రేసుకు టైమయినట్టుంది...మళ్ళా రేపు వస్తాను" అని నుంచుంది.

"ఓ.కే" అన్నాడు ఆనంద్ అద్దంలోకి చూస్తూ.

"నే నీ రోజునుంచి రేసులు మానేశా..." ఉన్నట్లుండి అన్నాడు రాజు. ఆనంద్ ఆశ్చర్యంగా వెనక్కు తిరిగాడు. వసుంధర కళ్ళు మిలమిలా మెరిసిపోతున్నాయి.

"ఒరేయ్! నువ్వు వెళ్ళకపోతే అక్కడ రేసులు నడవ్వురా...వాళ్ళ నెందుకు ఇబ్బంది పెడ్తావ్?" రాజు నిశ్చయాన్ని తేలికగా తీసేస్తూ అన్నాడు ఆనంద్.

నిజానికి రేసుల విషయంలో రాజుకు చాలా అనుభవం, నాలెడ్జ్ ఉన్నాయి. కాని, అదృష్టం కలిసి రాలేదు ఎప్పుడూ. గత మూ డేళ్ళుగా ప్రతి రేసు మీటింగుకు వెళ్తున్నా. చివరకు తన దైనందిన జీవితం విచిత్రంగా మారిపోయింది. పొద్దుటే స్టాప్‌వాచ్ తీసుకుని గుర్రాలకు ట్రెయినింగ్ ఇస్తుంటే అవి ఏ టైములో పరిగెడుతున్నాయో నోట్ చేసుకోవడం... దినపత్రికలలో రేసుల గురించి మాత్రం చదవడం... ఎవరైనా సలహా అడిగితే ఒక గంట సేపు తను సెలెక్ట్ చేసిన గుర్రం ఎందుకు నెగ్గుతుందో వివరించి చెప్పడం... రేసు అయిపోయిన మర్నాడు పత్రికల్లో తను ఆడిన గుర్రం ఎందుకు ఓడిపోయిందో, లేకపోతే నెగ్గిందో చదువుకొని తృప్తి పడడం... ఇంజినీరింగ్ చదివినా తనకు నచ్చిన ఉద్యోగం దొరక్క పోవడంతో కాంట్రాక్టుల్లోకి దిగాడు రాజు. తను చేస్తున్న కాంట్రాక్టులు అంతగా లాభించడం లేదు.

ఇటువంటి పరిస్థితుల్లో ఈ మధ్యే ఆఫీసరుగా హైదరాబాద్ వచ్చిన ఆనంద్ కనపడ్డాడు అతనికి. రాజు, ఆనంద్‌లు స్కూలులో కలిసి చదువుకున్నారు. ఇప్పుడు ఇద్దరూ కలిసి ఆదర్శనగర్‌లో ఓ రూమ్ తీసుకుని సెటిల్ అయ్యారు.

"సారీ, ఆనంద్. నాకూ మలక్‌పేటకీ ఋణం తీరిపోయింది ఈ రోజుతో. నీకు వెళ్ళాలని ఉంటే లెక్కలు కట్టి అక్కడ పెట్టాను రేస్‌బుక్...నువ్వు వెళ్ళు-" నిశ్చయంగా చెప్పాడు రాజు.

"సరే, మీ ఇష్టం. బై బై... వసూ" అంటూ బయటకు వెళ్ళిపోయాడు ఆనంద్ వాచీ చూసుకుంటూ.

ముభావంగా ఉన్న రాజును "మీరు రేసులు నిజంగా మానేశారా?" అని అడిగింది వసుంధర.

"నిజంగానే."

"ఎందుకు?"

"నీ కోసం."

అదిరిపడింది వసుంధర. "నా కోసమా?... అంటే?" ఆశ్చర్యంగా అడిగింది.

"నీ మీద గౌరవం కొద్దీ... ఇష్టం కొద్దీ..."సమాధానం చెప్పాడు రాజు.


"థాంక్యూ. వస్తాను, రాజూ." ఇంక అక్కడ ఉండలేకపోయింది వసుంధర.

ఇంటికి చేరుకున్న వసుంధరకు రాజు మాటలే చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. 'తనంటే ఎంత ఇష్టం రాజుకు! ఒక్క మాటతో రేసులు మానేశాడు. ఆనంద్ తను చెప్పింది ఏదీ సీరియస్‌గా తీసుకోడు. వాళ్ళిద్దరికీ ఎంత వ్యత్యాసం!' అనుకుంది వసుంధర.

** ** **

తరవాత రోజులూ, నెలలూ గడిచిపోయాయి. కాలంతోపాటే రాజూ, ఆనంద్‌ల పోర్టుఫోలియోలు కూడా మారిపోయాయి. బాంక్‌కుకూడా సెలవు పడేసి రేసులకి వెళ్తున్నాడు ఆనంద్. రాజు రేసులు పూర్తిగా మానేశాడు. మునపట్లా ఆనంద్, వసుంధర తరుచు సినిమాలకు, షికార్లకు వెళ్ళడం తగ్గిపోయింది. అప్పుడప్పుడు రాజును తోడు తీసుకొని సినిమాలకు, పార్కులకు వెళ్తోంది వసుంధర.

పరీక్షలు దగ్గర కావడంతో ఆ రోజు సాయంత్రం వరకూ పుస్తకాల ముందు కూర్చున్న వసుంధరకు బోర్ కొట్టింది. ఓసారి రాజునూ, ఆనంద్‌నూ చూడాలనిపించింది. టైముకూడా ఆరు గంట లయింది.



'ఈపాటికి ఆనంద్‌కూడా రేసుల్నించి తిరిగి వచ్చేనుంటాడు.'

గబగబా ముస్తాబై ఆనంద్ రూమ్ దగ్గర ఆటో దిగింది వసుంధర.

తనకోసమే ఎదురు చూస్తున్నట్లు గుమ్మం దగర నుంచున్న రాజు ముఖంలో వేయి జ్యోతులు వెలిగాయి వసుంధరను చూస్తూనే.

"ఏమిటి, వసూ...బొత్తిగా నల్లపూసవయిపోయవు?" చనువుగా అడిగాడు.

"పరీక్షలు కదా...ఈ రెండు రోజులూ కష్టపడితే ...వదిలిపోతుంది పీడ...ఆనంద్ ఇంకా రాలేదా?"

"వచ్చాడు. ఫ్రెండ్స్‌తో కలిసి మళ్ళా బయటికి వెళ్ళాడు."

"ఎక్కడికి?"

"క్లబ్బుకి వెళ్ళి అక్కడి నుంచి కాబ్రే షోకు వెళ్తామన్నారు." ప్రతి మాట నొక్కి చెప్పాడు.

నిట్టూర్చింది వసుంధర- "పబ్లిక్ గార్డెన్స్‌కు వెళ్ళి కాసేపు గాలి పీల్చుకుందా మనుకున్నాను."

"ఇప్పుడు మాత్రం ఏమయింది? నేను రాకూడదా నీతో?" అడిగాడు రాజు.

"వస్తావా?" వసుంధర ఆ మాట అనడమే తడవు తలుపు తాళం పెట్టి బయలుదేరాడు రాజు.

దారి పొడుగునా, పబ్లిక్ గార్డెన్స్‌లోనూ ఏవేవో కబుర్లు నవ్వుతూ చెప్తూనే ఉంది. మంత్రముగ్ధుడిలా వసుంధర మాటలు వింటూ ఉండిపోయాడు రాజు. చూస్తుండగానే టైము తొమ్మిది గంటలు అయిపోయింది. వెన్నెలలో కూర్చున్న వసుంధర ఉన్నట్టుండి, "నాకో సహాయం చేయగలవా?" అని అడిగింది.

"చెప్పు...నా వల్ల కాకపోయినా చేయడానికి ప్రయత్నం చేస్తాను."

"వచ్చే వారం మనం రేసులకు వెళ్ళాలి."

"మనమా?"

"అవును."

"పెట్టుబడి నాది...గెలుపు గుఱ్ఱాల ఎంపిక నీది. వచ్చినదాంట్లో ఫిఫ్టీ...ఫిఫ్టీ."

రాజు తన చెవుల్ని తాను నమ్మలేక పోయాడు.

"డన్" అని మాత్రం అనగలిగాడు నమ్మకంగా అడుగుతున్న కళ్ళని చూస్తూ.

"కాని...ఒక షరతు. ఆపైని మరోసారి నువ్వు రేసులకు వెళ్ళకూడదు...ఒట్టు వేయి..."

చేయి జాచింది వసుంధర.

యాంత్రికంగా ఆమె చేతిలో చేయి వేసి ఆమె కళ్ళలోకి చూస్తూనే ఉండిపోయాడు వెన్నెల క్రీనీడల్లో.

వసుంధర చేయి వెనక్కు తీసుకొనేవరకూ రాజు ఈ ప్రపంచంలో లేడు.

రూము చేరి పడుకున్నాడన్న మాటే గాని, నిద్ర రావడంలేదు రాజుకు. 'వసుంధర చేతిలో ఎంత మృదుత్వం ఉంది! ఆమె తప్పకుండా తనంటే ఇష్టపడుతోంది. వసూ తనకు జీవితంలో భాగస్వామి అయితే...' ఉక్కిరి బిక్కిరి అయిపోయాడు రాజు.

** ** **

అనుకున్న ఆదివారం రానే వచ్చింది. ఈలోగా రాజు అప్లై చేసిన మేనేజర్ ఉద్యోగానికి అతణ్ణి సెలెక్ట్ చేశారు. ఒక కారు, క్వార్టర్స్, మూడువేల జీతం!

రాజు ఆనందానికి అవధుల్లేవు.

"యూ ఆర్ లక్కీ" అన్నాడు ఆనంద్.

"లక్ లేకపోతే అన్నీ వృథాయే... నువ్వు కరెక్టుగా చెప్పావ్" అన్నాడు రాజు హుషారుగా.

స్పెషల్‌గా డ్రెస్ చేసుకుని వచ్చిన వసుంధరను నవ్వుతూ ఆహ్వానించాడు రాజు.

"వసూ...ఉయ్ ఆర్ విన్నింగ్ ఎ బిగ్ ఫార్చ్యూన్ టుడే" అన్నాడు రాజు.

ఆనంద్ కేమీ అర్థం కావడం లేదు. వింతగా ఇద్దరివైపూ చూస్తూ ఉండిపోయాడు. మొదటిసారి అసూయ, అనుమానం గుండెలో ద్వంద్వ యుద్ధం ప్రారంభించాయి- 'వసూతో వీడు...ఇంత సన్నిహితంగా...' దొంతర్లుగా వస్తున్న భావాల్ని తుడిచేస్తూ, "ఏమిటి కథ? నాకూ చెప్పండి...మీ ఆనందాన్ని నేనూ పంచుకుంటా" అన్నాడు అయోమయంగా.

"ఈరోజు రాజూ, నేనూ రేసులకి వెళ్తున్నాం. వచ్చే లాభాల్లో రాజూ, నేనూ పార్ట్‌నర్స్" అంది వసుంధర క్లుప్తంగా.

"నువ్వు రేసులకా?...రాజు మళ్ళా..." నోరు తెరిచేశాడు ఆనంద్.

"వసూ...నువ్వు రేసులకు వెళ్ళడం నా కిష్టంలేదు. ఆడవాళ్ళకు జూదం ఏమిటి?" తేరుకొని సీరియస్‌గా అన్నాడు ఆనంద్.

"ఆడవాళ్ళయితే మాత్రం..." స్త్రీ స్వాతంత్ర్యం మీద చర్చలోకి దిగిపోయింది వసుంధర.

"అది కాదు, వసూ...గత మూడు నెలల్లో నాలుగు వేల రూపాయలు పోయాయి నాకు. అక్కడ డబ్బులు రావు అందరికీ..." నచ్చచెప్పబోయాడు ఆనంద్.

"ఆ నాలుగువేలూ ఇచ్చేస్తే...నువ్వు రేసులు మానేస్తావా పూర్తిగా?" ఛాలెంజి చేసింది వసుంధర.

పందెంలోకి దింపడమే మంచిదని అనిపించింది వసుంధర తత్త్వం తెలుసున్న ఆనంద్‌కు.

"నువ్వు ఈ రోజు రేసుల్లో సంపాదించి ఇస్తేనే ...లేకపోతే నువ్వు మళ్ళా రేసుల గొడవ ఎత్తకూడదు...మరోసారి రేస్‌కోర్స్ త్రొక్కకూడదు." కండిషన్ పెట్టాడు ఆనంద్. రాజు ఏదో చెప్పబోయాడు..."దటీజ్ ఓకే విత్ మి..." వసుంధర సంభాషణ నిలిపేసింది.

ముగ్గురూ రేసుకోర్సులో గెలుపుగుర్రాల ఎంపిక విషయంలో తర్జన భర్జనలు ప్రారంభించారు. పాడక్ చుట్టూ తిరిగి గుర్రాల్ని చూసి వచ్చారు. రాజు తన అనుభవాన్ని కూడ గట్టుకొని ఆ రేసులో రెండు గుర్రాల్ని ఎంపికచేశాడు.




మొదటి గుర్రం రింగ్‌లో ఫేవరిట్. అది నెగ్గితే రూపాయికి యాభై పైసలు అదనంగా ఇస్తామంటున్నారు బుక్కీలు. రెండవదానికి పదిరెట్లు. "అవకాశం ఉంది నెగ్గడానికి" అంటాడు రాజు. కాని, ధైర్యంగా మాత్రం చెప్పలేకపోతున్నాడు.

పర్స్‌లోంచి రెండు వందల రూపాయలు తీసి రాజుకు ఇచ్చింది వసుంధర పది రెట్లు ఇచ్చే గుర్రం మీద ఆడమని.

రేసు ప్రారంభం అయింది. అందరికీ బ్లడ్ ప్రెషర్ ఎక్కువవుతోంది. రాజుకు, వసుంధరకు ఆ గుర్రం నెగ్గడం...వాళ్ళు నెగ్గడం ఒకటే అయిపోయింది. ఆనంద్ మాత్రం ఫేవరిట్ గుర్రంపై ఆడి నిశ్చింతగా కూర్చున్నాడు.

గుర్రాలు మలుపు తిరిగాక కూడా రాజు ఆడిన గుర్రం వెనకనే ఉంది. ఆఖరి వంద మీటర్లలో తల ముందుకు పెట్టి నెగ్గేసింది ఆ గుర్రం.

తరవాత నాలుగు రేసులు నడచిపోయాయి. ఏవో గుర్రాల పేర్లు చెప్తూనే ఉన్నాడు రాజు వసుంధరని ఆడమంటూ. వసుంధరససేమిరా "నో" అంటూనే పోతోంది. వాళ్ళిద్దరూ రేసులు చూస్తూ కూర్చుండి పోయారు.

ఆనంద్ మాత్రం రేసుకోర్సు కలదొక్కేస్తున్నాడు. ఫోర్‌కాస్టులు, క్వినిల్లాలు, జాక్‌పాట్‌లు, తనాలాలు...ఒకటేమిటి-అన్ని టిక్కెట్లూ కొనేస్తున్నాడు.

నిజానికి రాజు చెప్పిన గుర్రాలు కాని...ఆనంద్ కొన్న టిక్కెట్లు కాని...ఒక్కటీ నెగ్గటల్లేదు.

ఇంక రెండు రేసులు మిగిలాయి ఆ రోజుకు.

"ఈ రేసులో ఏ గుర్రం ఆడదాం, రాజూ?" అడిగింది వసుంధర. ఏదో గుర్రం పేరు చెప్పాడు రాజు. ఆనంద్‌తో పందెం గెలవడానికి వసుంధరకు ఇంకా ఎనిమిది వేలు కావాలి. రింగ్‌వైపు నడచి వెళ్ళింది. నాలుగు రెట్లు ఇస్తున్న గుర్రాన్ని సెలెక్ట్ చేసి వచ్చి రెండువేల రూపాయలు ఆడేయమంది రాజుతో.

రాజు అయిష్టంగానే ఆడేసి వచ్చాడు. వసుంధర ముక్కోటి దేవతల్ని తలుచుకుంది ఆ గుర్రం నెగ్గాలని.

చివరకు ఆ గుర్రం మొదటి నుంచీ చివరవరకూ ఒక్క ఉదుటున నెగ్గి పారేసింది.

ముగ్గురి ముఖాల్లో పెద్ద రిలీఫ్.

"మనం లక్కీ పార్ట్‌నర్స్..." పదివేల రూపాయలు బుక్కీల దగ్గర నుంచి తీసుకు వచ్చిన రాజు వసుంధర భుజం చుట్టూ చేయి వేస్తూ అన్నాడు-

"ఈ రోజు రేసుల వరకే...రేపటి నుంచి నో రేసింగ్..." గుర్తు చేసింది వసుంధర.

రూము చేరుకున్న వసుంధర వాటా అయిదు వేలూ ఆనంద్‌కు ఇచ్చి ఉంచమంది.

"నాకెందుకు? అది నీ మనీ..." అన్నాడు ఆనంద్ బుంగమూతి పెట్టి.

"నా మనీ నీ మనీ కాదా?" అడిగింది వసుంధర.

రాజుకు ఆ మాటలు పిడుగులు పడ్డట్టు వినిపించాయి.

'దేనికయినా లక్ ముఖ్యం' అనుకున్నాడు పైకే.

*